సాక్షి
మహబూబ్‌నగర్
బుధవారం । 7 । జూన్ । 2023



మంటగలుస్తున్న మానవత్వం
క్షణికావేశంలో చేస్తున్న హత్యలతో జీవితాలు అర్ధంతరంగా ముగిసిపోతున్నాయి.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 40.3 /23.8
ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

11న సాహిత్య దినోత్సవం

జెడీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 11న 'తెలంగాణ సాహిత్య దినోత్సవం' వేడుకలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.రవి నాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా శిల్పారామంలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని, ఇందులో పాల్గొనే కవులు, రచయితలు, సాహితీవేత్తలు జిల్లాకు చెందిన వారై ఉండాలని, తెలుగు, ఉర్దూ కవులందరూ పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కవితలు 20 పంక్తులు, గరిష్టంగా 26 పంక్తులకు మించకుండా ఉండాలని సూచించారు. తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ ప్రగతి అనే కవితాంశంతో కవితలు ఉండాలని పేర్కొన్నారు. కవులు పంపించే కవితలు ఇంతకు ముందు దినపత్రికలు, వారపత్రికలు పుస్తకాలలో ప్రచురించినవై ఉండొద్దని కోరారు. కవులు తమ కవితలను ఈనెల 9 సాయంత్రం 5 గంటల వరకు వాట్సాప్ నంబర్ 82473 01883కు వారి పేరు, చిరునామా, మొబైల్ నంబర్ తో సహా పంపాలని తెలిపారు. ఒక కవి లేదా కవయిత్రి ఒక కవితను మాత్రమే పంపించాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు, జిల్లాకు చెందిన ప్రముఖులు ఈ కవి సమ్మేళనానికి హాజరవుతారని పేర్కొన్నారు.

డీటీఓగా శ్రీనివాస్



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా ట్రెజరీ అధికారిగా శ్రీనివాస్ నియమితులయ్యారు. మంగళవారం ఆయన విధులు స్వీకరించారు. ఇక్కడ డీటీఓగా ఉన్న కోమల బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లారు. ఆమె స్థానంలో ఏటీఓ ఉమాదేవి అదనపు బాధ్యతలు నిర్వహించారు. పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖలో చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా శ్రీనివాస్ బదిలీపై డీటీఓగా వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మర్యాద పూర్వకంగా జిల్లా రవినాయక్‌ను కలిశారు. కలెక్టర్‌తో పాటు ఆశాఖ అధికారులు, సిబ్బంది శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

వేరుశనగ క్వింటా రూ.6,960

జడ్చర్ల/ దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం వేరుశనగ క్వింటాల్‌కు గరిష్టంగా రూ.6,960, కనిష్టంగా రూ.6,370 ధరలు లభించాయి. అలాగే మొక్కజొన్నకు గరిష్టంగా రూ.1,830, కనిష్టంగా రూ.1,300, ఆముదాలు గరిష్టంగా రూ.5,515, కనిష్టంగా రూ.5,295, హంసకు గరిష్టంగా రూ.1,709, కనిష్టంగా రూ.1,256, ఆర్ఎన్ఆర్‌కు గరిష్టంగా రూ.2,329, కనిష్టంగా రూ.1,659, కానుగు పలుకులు క్వింటాకు రూ.3,763, జొన్నలు గరిష్టంగా రూ.5,300, కనిష్టంగా రూ.5,200 ధరలు లభించాయి.

సోనామసూరి ధర రూ.2,100
దేవరకద్ర మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,100 ఒకే ధర నమోదైంది. యాసంగి సీజన్ దిగుబడులు పూర్తి కావడంతో మార్కెట్‌లో లావాదేవీలు తగ్గిపోయాయి.

నేడు ఉల్లిపాయల వేలం..
దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లిపాయల బహిరంగ వేలం నిర్వహిస్తారు. వారానికి ఒకసారి జరిగే వేలానికి స్థానిక వ్యాపారులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో పాల్గొనే అవకాశం ఉంది. అయితే గత రెండు వారాలుగా ఉల్లి ధరలు నిలకడగా ఉన్నాయి.



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్



నాగర్‌కర్నూల్‌లో బహిరంగ సభకు తరలివచ్చిన జనం

పచ్చని పైర్లతో.. పాలమూరు కళకళ

గంజి కేంద్రాలు పోయి కొనుగోలు కేంద్రాలు వచ్చినయ్

నాగర్‌కర్నూల్ ప్రగతి నివేదన సభలో సీఎం కేసీఆర్

- మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ సాధించా..
- దుందుభి వాగులో నీళ్లు చూస్తుంటే నా కళ్లలో ఆనందబాష్పాలు
- ఆగస్టులో పాలమూరు–రంగారెడ్డి పూర్తి చేసి ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- మర్రి మొండిపట్టు పట్టి మెడికల్ కళాశాల సాధించిండు..

నాగర్‌కర్నూల్: పాలు గారే పాలమూరు జిల్లాలో గంజి కేంద్రాలు ఏంటని ఒకప్పుడు ఏడ్చామని.. ఇప్పుడు గంజి కేంద్రాలు పోయి కొనుగోలు కేంద్రాలు వచ్చినయ్ అని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్‌లో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒకప్పుడు బొంబయి వలసలకు కేరాఫ్ అడ్రస్‌గా పాలమూరు ఉండేదని.. అప్పట్లో గంజి కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు నాయకులు పోటీ పడేవారన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో చాలా వెనకబాటు తనం ఉంది.. కరువుతో ఉన్న జిల్లాలో నేను ఎంపీగా ప్రొఫెసర్ జయశంకర్ సూచన మేరకు పోటీ చేశా.. పాలమూరు ఎంపీగా ఉన్న సమయంలోనే తెలంగాణ సాధించాం. కాంగ్రెస్ 50 ఏళ్లు.. ఇతర పార్టీలు పాలించినా.. ఏ ముఖ్యమంత్రి కనీసం మంచి నీరు కూడా ఇవ్వలేకపోయారని విమర్శించారు. ప్రస్తుతం మిషన్ భగీరథ పథకం వల్ల కృష్ణమ్మ నీటితో ప్రజల గొంతు తడుపుకొంటున్నారన్నారు.

నీటితో చెక్‌డ్యాంలు..
దుందుభీ వాగుపైన గోరటి వెంకన్న పాడిన 'వాగు ఎండిపాయెరా.. పెద్ద పేగు ఎండి పాయెరా..' అనే పాటను కేసీఆర్ గుర్తు చేశారు. చెరువులో కట్టిన చెక్‌డ్యాంలతో వాగు నీటితో కళకళలాడుతోంది. వాటిని చూస్తుంటే నా కళ్లలో ఆనంద బాష్పాలు వస్తున్నాయని కేసీఆర్ ఆనందం వ్యక్తం చేశారు. అచ్చంపేట ప్రాంతానికి రూ.2వేల కోట్లతో ఉమామహేశ్వర లిఫ్ట్ ఏర్పాటు చేసుకోబోతున్నామన్నారు. వలస వెళ్లిన వారంతా వాపస్ వచ్చారు. బిహార్ లాంటి ప్రాంతాల నుంచి కూలీలు ఇక్కడికి వస్తున్నారు.. నా జీవితంలో నేను సంతోషించిన విషయం పాలమూరును పంటల భూమిగా మార్చడమే చాలా ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఆగస్టులో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలను పూర్తి చేసి ఉమ్మడి పాలమూరు జిల్లాను మరింత సస్యశ్యామలం చేస్తామన్నారు.

■ నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులతో నాగర్‌కర్నూల్ జిల్లా సస్యశ్యామలమైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాక ముందు జిల్లాలో అధ్వాన పరిస్థితులు ఉండేవని, తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటుతో ఉమ్మడి పాలమూరు జిల్లా సాగు, తాగునీటి కొరత లేకుండా ఉందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నందుకే ఈ అభివృద్ధి సాధ్యమైందన్నారు. త్వరలోనే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలు పూర్తి చేసి మరింత సాగునీరు అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో హోంమంత్రి మహమూద్ అలీ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ రాములు, ఎమ్మెల్సీలు దామోదర్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, గోరటి వెంకన్న, చల్లావెంకట్రామిరెడ్డి, ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వరరెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకో మెడికల్ కాలేజీ..
ఉమ్మడి పాలమూరులో జిల్లాకు ఒకటి చొప్పున ఐదు మెడికల్ కళాశాలకు వస్తాయని ఎవరన్నా అనుకున్నామా.. కానీ వచ్చినయ్. తుపాకీ గుండులాగా మర్రి జనార్దన్‌రెడ్డి వచ్చి మొండిపట్టు పట్టి నాగర్‌కర్నూల్‌కు మెడికల్ కళాశాల సాధించాడని సీఎం కేసీఆర్ అన్నారు. 'సాగునీటి కోసం తవ్వించిన బావులను, చెరువులను గత పాలకులు నాశనం చేశారు.. స్తంభాల లెక్క చెరువులు లొట్టపీసు చెట్లతో నిండిపోయి ఉండేవి. నాగర్‌కర్నూల్ కేసరి సముద్రంలో క్రికెట్ ఆడుకునే వారు. నేడు పరిస్థితి మారి అభివృద్ధి జరగడంతో పాటు చూడచక్కని బుద్ధ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నాం.' అని పేర్కొన్నారు.



కలెక్టర్ ఉదయ్‌కుమార్‌ను సీట్లో కూర్చోబెడుతున్న సీఎం కేసీఆర్



ఎస్పీ మనోహర్‌ను అభినందిస్తున్న సీఎం



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం కేసీఆర్

సీఎం పర్యటన సాగిందిలా..

ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పర్యటన నాగర్‌కర్నూల్ జిల్లాలో 2గంటల 46 నిమిషాల పాటు సాగింది. పర్యటనలో భాగంగా నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్ సముదాయం, జిల్లా ఎస్పీ కార్యాలయం, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రగతి నివేదన బహిరంగసభలో సీఎం పాల్గొని, 38 నిమిషాల పాటు ప్రసంగించారు.

- ■ 5.02 గంటలకు సమీకృత కలెక్టరేట్‌లో సీఎం హెలికాప్టర్ ల్యాండింగ్
- ■ 5.08 గంటలకు జిల్లా బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం
- ■ 5.13 గంటలకు జిల్లా పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజుని కుర్చీలో కూర్చోబెట్టారు.
- ■ 5.17గంటలకు పార్టీ కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీ కార్యాలయానికి బస్సులో బయలుదేరిన సీఎం, మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు
- ■ 5.20 గంటలకు జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరిక. సీఎంకు స్వాగతం పలికిన ఎస్పీ మనోహర్
- ■ 5.32 గంటలకు సీఎం ఎస్పీ కార్యాలయమంతా తిరుగుతూ ఎస్పీ చాంబర్‌కు చేరిక
- ■ 5.34 గంటలకు ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన డీజీపీ అంజనీకుమార్
- ■ 5.36 గంటలకు డీజీపీ అంజనీకుమార్ యాదవ్ ఎస్పీ మనోహర్‌ను కుర్చీలో కూర్చొబెట్టి శుభాకాంక్షలు తెలిపిన సీఎం
- ■ 5.40 గంటలకు ఎస్పీ కార్యాలయం నుంచి బస్సులో సమీకృత కలెక్టరేట్‌కు పయనం
- ■ 5.45 గంటలకు చేరిక. కలెక్టర్ ఉదయ్‌కుమార్ సీఎంకు బొకే ఇచ్చి స్వాగతం పలికారు
- ■ 5.48 గంటలకు పోలీసుల గౌరవవందనం స్వీకరించిన కేసీఆర్
- ■ 5.54 గంటలకు కలెక్టరేట్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి
- ■ 5.56 గంటలకు కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఈఎన్సీ గణపతిరెడ్డి
- ■ 5.58 గంటలకు కలెక్టర్ చాంబర్‌లో పూజా కార్యక్రమాలు
- ■ 6.02 గంటలకు కలెక్టర్ ఉదయ్‌కుమార్‌ను కుర్చీలో కూర్చొబెట్టి శుభాకాంక్షలు తెలిపిన సీఎం కేసీఆర్
- ■ 6.04 గంటలకు సీఎంతో పాటుగా మంత్రులు, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్‌లను కలెక్టర్ శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేత
- ■ 6.06 గంటలకు కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించిన సర్వమత ప్రార్థనలు
- ■ 6.10 గంటలకు కలెక్టర్ కుమారుడికి సీఎం ఆశీర్వాదం
- ■ 6.13 గంటలకు కలెక్టర్ చాంబర్‌లోని మీటింగ్ హాల్‌లో అధికారులతో ప్రత్యేక సమావేశం, అభివృద్ధి పనులపై సమీక్ష
- ■ 6.20 గంటలకు సమావేశం ముగించుకొని కలెక్టరేట్ నుంచి ప్రగతి నివేదన సభ ప్రాంగణానికి బయల్దేరిన ముఖ్యమంత్రి, మంత్రులు
- ■ 6.45 గంటలకు ప్రగతి నివేదన సభ ప్రాంగణానికి చేరుకున్న సీఎం కేసీఆర్
- ■ 6.50 గంటలకు సభాధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ప్రసంగం
- ■ 6.59 గంటలకు సీఎం కేసీఆర్ ప్రసంగం ప్రారంభం
- ■ 7.37 గంటలకు ముఖ్యమంత్రి ప్రసంగం పూర్తి
- ■ 7.39 గంటలకు సభా ప్రాంగణం నుంచి బయల్దేరిన కేసీఆర్
- ■ 7.40 గంటలకు సభా ప్రాంగణం నుంచి హైదరాబాద్‌కు రోడ్డు మార్గాన వెళ్లేందుకు కాన్వాయ్ ప్రారంభం
- ■ 7.48 గంటలకు నాగర్‌కర్నూల్ పట్టణాన్ని దాటిన ముఖ్యమంత్రి కాన్వాయి.

తీరిన తాగునీటి కష్టాలు

- 18న మంచినీళ్ల పండుగను విజయవంతం చేయాలి
- డీపీఓ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఈఈ పుల్లారెడ్డి




మాట్లాడుతున్న డీపీఓ వెంకటేశ్వర్లు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత గ్రామాల్లో తాగునీటి కష్టాలు తీరాయని డీపీఓ వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 18న నిర్వహించనున్న మంచినీళ్ల పండుగ, నీళ్ల విజయాలు అంశంపై మంగళవారం స్థానిక జెడ్పీహాల్‌లో పంచాయతీ కార్యదర్శులు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటుకు ముందు గ్రామాల్లో నీళ్ల కోసం కొట్లాటలు జరిగేవని తెలంగాణ రాష్ట్ర వచ్చిన తరువాత నీళ్ల కష్టాలు పూర్తిగా తీరిపోయాయన్నారు. స్వరాష్ట్రంలో నీళ్ల కష్టాలను తీర్చేందుకు మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేసి ప్రతి ఇంటికీ మంచినీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాకముందు ఎలా ఉండేది.. ఇప్పుడు ఎలా ఉందో వివరిస్తూ ఫొటోల రూపంలో ఫ్లెక్సీలను తయారు చేసి గ్రామాల్లో కట్టించాలని సూచించారు. మిషన్ భగీరథ ఈఈ పుల్లారెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మిషన్ భగీరథ కార్యక్రమంలో భాగంగా ఓవర్ హెడ్ ట్యాంక్‌లను నిర్మించామని, పైప్‌లైన్ వేసి ఇంటింటికీ నల్లాలను బిగించినట్లు పేర్కొన్నారు. గ్రామంలో పూర్తిగా ఉచితంగా మంచినీళ్లు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. 18న గ్రామగ్రామాన నీళ్ల పండుగ పేరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి పంచాయతీ కార్యదర్శి కృషి చేయాలని సూచించారు. మంచినీళ్ల పండుగ, తాగునీళ్లపై సాధించిన విజయలపై సభలు నిర్వహించి ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ఈ కార్యక్రమన్ని సంబంధించిన ఫ్లెక్సీని విడుదల చేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ వెంకట్‌రెడ్డి, డీఎల్‌పీఓ వరలక్ష్మి, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీసీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బీసీ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో కులవృత్తిదారులైన బీసీలకు రూ.లక్ష సబ్సిడీ రుణాలు పొందేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ రవినాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆసక్తి గల వారు బుధవారం నుంచి ఈనెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇందు కోసం కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, ఆహార భద్రత కార్డులు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

సర్కారు బడుల్లో 1,546 మంది అడ్మిషన్లు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లను పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బాడిబాట కార్యక్రమాన్ని ఈనెల 3వ తేదీ నుంచి విద్యాశాఖ అధికారులు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు అన్ని గ్రామాలు, తండాల్లో విద్యార్థులు ఉపాధ్యాయులు ర్యాలీలు నిర్వహిస్తూ ఇంటింటికి తిరుగుతూ అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు అన్ని పాఠశాలల్లో కలిపి 1,546 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారు. ఇందులో 1,167 మంది విద్యార్థులు ఒకటో తరగతిలో చేరారు. వీరిలో ఐదేళ్లు నిండి, అంగన్ వాడీ నుంచి ప్రభుత్వ బడిలో చేరిన వారు ఉన్నారు. మరో 379 మంది విద్యార్థులు 2 నుంచి 10వ తరగతి వరకు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడిలో చేరిన వారు ఉన్నారు. ఈనెల 17వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో కనీసం 10వేల మంది విద్యార్థులు ప్రభుత్వ బడిలో చేర్పించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

పోడు భూములు దున్నుకోండి



భట్టి పాదయాత్రకు కోలాటాలతో స్వాగతం పలుకుతున్న సిద్దాపూర్ గ్రామస్తులు

- కాంగ్రెస్ పార్టీ మీకు అండగా ఉంటుంది
- నాలుగు నెలల్లో మీ పొలాలు మీ సొంతం అవుతాయి
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

అచ్చంపేట: 'రుతుపవనాలు వస్తున్నాయి.. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పంచిన పోడు భూములు మీరే దున్నుకోండి.. అరకలు కట్టి పంటలు పండించండి.. కాంగ్రెస్ పార్టీ మీకు అండగా ఉంటుంది' అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ గద్దలు భూములపైన వాలకుండా నాలుగు నెలలు కాపాడుకుంటే మీ భూములు మీకు సొంతమవుతాయని అభయం ఇచ్చారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం ఉదయం అచ్చంపేట మండలంలోని గుర్రలబండ నుంచి సిద్దాపూర్, చీన్యాతండా, లింగరోనిపల్లి, మన్నెవారిపల్లి మీదుగా ఎస్‌బీఎల్‌సీ వరకు సాగింది. సిద్దాపూర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ భయం భయంగా బతుకుతున్న ప్రజలకు విముక్తి కల్పించేది కాంగ్రెస్ పార్టీ అన్నారు. రాష్ట్రంలో ఉన్న దుర్మార్గపు ముఖ్యమంత్రి, ఆయన చెంచాగాళ్లైన ఎమ్మెల్యేల వల్ల భూములు కోల్పోతున్న పేదలకు మేం అండగా నిలబడతామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్ఎస్ ప్రభుత్వం కేసులు పెట్టి లాక్కున్న భూములను తిరిగి పేదలకు చట్టబద్ధత కల్పిస్తామని, ఆత్మగౌరవంతో బతికేలా చేస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో ఎక్కడ చూసిన ప్రజలు ఇళ్లు, సాగు నీరు కావాలని అడుగుతున్నారని, కాంగ్రెస్ హయాంలో కేఎల్ఐ కింద 16 ప్రధాన కాల్వలు, బ్రాంచ్ కెనాల్ తవ్వామన్నారు. ఆ తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వకపోగా.. పంట, పిల్ల కాల్వలు తవ్వలేదన్నారు. పుల్జాల వద్ద నిలిచిపోయిన కేఎల్ఐ కాల్వ 3 కి.మీ., తవ్వితే చంద్రసాగర్‌కు నీళ్లు వచ్చి.. ఏజెన్సీ గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. కానీ, ఇక్కడి చేతకాని పాలకుల వల్ల నీళ్లు రావడం లేదని విమర్శించారు.

నిర్బంధం పెరిగింది..
టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ వస్తేనే ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. కేసీఆర్ పాలనలో పోలీసుల దాడులు పెరిగాయని.. ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీలో భూములు కోల్పోయిన పేదలు పరిహారం ఇవ్వమని అడిగినందుకు కేసులు పెట్టిన దుర్మార్గపు ప్రభుత్వం ఇది అన్నారు. డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సిద్దాపూర్‌ను మండలంగా మారుస్తామన్నారు. సిద్దాపూర్‌కు సాగునీరు, ఎస్ఎల్‌బీసీ వరకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో దేవరకొండ మాజీ ఎమ్మెల్యే బాలునాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నాయకులు మనోహర్, రామనాథం, చంద్రమోహన్, రమేష్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, భారతయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు
సిద్దాపురంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు భట్టి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి భట్టి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. తిరుపతయ్య, ఎల్లయ్య, నిరంజన్, అంజి, ముత్యాలు, ఆంజనేయులు తదితరులున్నారు.

పాలమూరుకు త్వరలో మరిన్ని పరిశ్రమలు



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు: జిల్లాకు త్వరలో మరిన్ని పరిశ్రమలు రాబోతున్నాయని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం శిల్పారామంలో ఏర్పాటు చేసిన తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. మొదట జిల్లా జౌళిశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తర్వాత జిల్లాలో 758 సూక్ష్మ, 105 చిన్న తరహా, 23 భారీ పరిశ్రమలు, మూడు మెగా తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. టీఎస్ఐపాస్ ద్వారా నిర్ణీత సమయంలో పరిశ్రమకు అనుమతులు వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, పరిశ్రమలకు కనీసం అవసరమైన నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నందుకే రాష్ట్రంలో పెద్ద పెద్ద పరిశ్రమలు వచ్చినట్లు తెలిపారు. పాలమూరులో అమర్‌రాజా బ్యాటరీ ద్వారా ఎంతో మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. పక్క రాష్ట్రాల్లో పరిశ్రమలకు 14 నుంచి 18 గంటల విద్యుత్ ఇస్తుంటే.. తెలంగాణలో 24 గంటల విద్యుత్ ఇస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ జి.రవినాయక్ మాట్లాడుతూ టీఎస్ఐపాస్ ద్వారా వస్తున్న ఆన్‌లైన్ దరఖాస్తులు ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తూ వాటికి అనుమతులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో చాలామంది పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారని తెలిపారు. అనంతరం పరిశ్రమల నిర్వహణలో మంచి ప్రతిభ కనబరిచిన వారిని మంత్రి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ బాబురావు, జౌళిశాఖ ఏడీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్‌పై నుంచి పడి కండక్టర్ మృతి


వాసురామ్ నాయక్ (ఫైల్)

కోస్గి: విధులు ముగించుకొని స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో బైక్ అదుపు తప్పి కిందపడిన ఓ ఆర్టీసీ కండక్టర్ మృతి చెందిన సంఘటన గుండుమాల్ మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. నూతనంగా ఏర్పడిన కొత్తపల్లి మండల పరిధిలోని కొత్తపల్లి తండాకు చెందిన వాసురామ్ నాయక్(47) కోస్గి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. గుండుమాల్ గ్రామ శివారులో రోడ్డుపై ఉన్న మట్టి దిబ్బను గమనించకుండా వెళ్లడంతో బైక్ అదుపు తప్పి కింద పడింది. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అటుగా వెళ్తున్న వారు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయనను మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి కుమారుడు రవిచరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైలు కింద జారి పడి వ్యక్తి దుర్మరణం

మదనాపురం: ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్‌కు మహమ్మద్ షమీ(47) మంగళవారం గద్వాలలోని బంధువుల శుభకార్యానికి వచ్చి తిరుగు ప్రయాణం రైల్లో మహబూబ్‌నగర్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొన్నూరు వద్ద ప్రమాదవశాత్తు కాలు జారి రైలు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై భార్య అన్వర్‌బేగం ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు ఆయన తెలిపారు. షమీకి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరి పరిస్థితి విషమం

వనపర్తి: మండలంలోని కడుకుంట్ల గ్రామ శివారు లిక్కర్ గోదాం వద్ద గ్రామంలోకి వెళ్తున్న ఓ మోటార్‌సైకిల్‌ను వెనక నుంచి వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో చెన్నయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా.. కొత్తకోట మండలం ముమ్మాలపల్లికి చెందిన చెన్నయ్య కడుకుంట్లలో పెద్ద దేవర పండగకు వెళ్తుండగా.. ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.

ఆటోను ఢీకొన్న కారు

- ముగ్గురికి గాయాలు

అలంపూర్: జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఆటోను గుర్తు తెలియని కారు ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఒకరికి స్వల్ప గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. మంగళవారం కర్నూల్ జిల్లా వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లెకి చెందిన భార్యభర్తలు రాజశేఖర్, లక్ష్మి, కూతురు శ్రుతి, కుమారుడు సుదీర్ ఆటోలో జాతీయ రహదారిపై గద్వాల్‌కు ఆటోలో ప్రయాణిస్తున్నారు. అలంపూర్ చౌరస్తా సమీప మార్గంలో ఆటోను వెనుక నుంచి కారు ఢీ కొనగా ఆటో రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ఘటనలో రాజశేఖర్, లక్ష్మి, శ్రుతికి తీవ్ర గాయాలైనట్లు, సుధీర్‌కు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను నేషనల్ హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

అమిస్తాపూర్‌లో చోరీ

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. రూ.1.50లక్షల విలువ గల బంగారు, వెండి ఆభరణాలను అపహరించారని ఎస్ఐ.భాస్కర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన సహదేవ్ గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం కూడా గొర్రెల మంద వద్దకు కపలా వెళ్లాడు. సహదేవ్ భార్య మంజులతో పాటు నలుగురు పిల్లలు, ఆడబిడ్డ వెంకటమ్మతో కలిసి ఇంటికి తాళంవేసి మిద్దెపై నిద్రించారు. దొంగలు ఇంటితాళం పగులగొట్టి మూడు తులాల బంగారు నాను పతకం, 5గ్రాముల బుట్టల కమ్మలు, 3 గ్రాముల మాటీలు, 2గ్రాముల బంగారు ఉంగరం, తులం బంగారు చుట్టిన ఉంగరం, 50తులాల వెండి, 20తులాల వెండి కాళ్ల గొలుసులు చోరీ చేశారు. మంగళవారం తెల్లవారుజామున 4:30 గంటల ప్రాంతంలో మిద్దెపై నుంచి దిగి వస్తుండగా దొంగలు పారిపోయారని ఎస్ఐ తెలిపారు. మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పీయూలో క్యాంపస్ ఎలక్షన్స్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో మంగళవారం క్యాంపస్ ఎలక్షన్స్ నిర్వహించారు. ఈ మేరకు వివిధ పరీక్షల అనంతరం 26 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కిరణ్, శివకుమార్, ప్లేస్‌మెంట్ అధికారి అర్జున్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద సీఎం కేసీఆర్, మంత్రులు మహమూద్ అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్‌యాదవ్, కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తదితరులు

సీఎం సభ సక్సెస్

కందనూలులో సీఎం కేసీఆర్ పర్యటన విజయవంతమైంది. జిల్లాకేంద్రంలో కలెక్టరేట్, ఎస్పీ, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవాలతోపాటు ప్రగతి నివేదన సభలో కేసీఆర్ పాల్గొని మాట్లాడారు. సభకు జిల్లావ్యాప్తంగా లక్షన్నరకు పైగా జనం తరలిరావడంతో జిల్లాకేంద్రం గులాబీమయమైంది. మొత్తం సీఎం పర్యటన సభ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

– సాక్షి నెట్‌వర్క్


తెలంగాణ తల్లి విగ్రహానికి పూలు చల్లుతున్న సీఎం కేసీఆర్


కలెక్టరేట్‌లో ప్రత్యేక పూజలు చేస్తున్న సీఎం కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు తదితరులు


ఎస్పీ కార్యాలయం ప్రారంభిస్తున్న డీజీపీ అంజనీకుమార్‌యాదవ్


ఈల వేస్తున్న కార్యకర్త


బహిరంగ సభకు తరలివచ్చిన మహిళలు

సభలో బీఆర్ఎస్ కార్యకర్తల సందడి

■ ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ పార్టీలో తమ మధ్యనే ఉంటూ కొందరు నాయకులు చిచ్చుపెట్టాలని చూస్తున్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసిన ఉమ్మడి జిల్లాలో 14 సీట్లు గెలిచి క్లీన్‌స్వీప్ చేస్తామన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తుంటే ఓటుకు నోటు కేసులో దొంగ ఓర్వలేకపోతున్నాడని దుయ్యబట్టారు. రాష్ట్ర ఏర్పాటే అసాధ్యమనుకున్న స్థాయి నుంచి.. రాష్ట్రాన్ని సాధించుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

■ కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కొందరు నాయకులు ఇల్లు విడిచి ఆకాశంలో స్వర్గం వెతుక్కుంటున్నారని ఎద్దేవా చేశారు. కొందరు నాయకులు కొల్లాపూర్‌లో కాకుండా బయటి ప్రాంతాల్లో పర్యటిస్తూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, దమ్ముంటే కొల్లాపూర్‌కు వచ్చి మాట్లాడితే నీ సంగతేంటో తేలుస్తామని హెచ్చరించారు.

■ కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ కేఎల్ఐ, పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టులను పూర్తి చేసి కల్వకుర్తిలో ఉన్న కరువును పారద్రోలుతాం అన్నారు. తొమ్మిదేళ్లలో రాష్ట్రంలో 1.20 కోట్ల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధిస్తుందనడానికి కందనూలే ఉదాహరణ అన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాకేంద్రం శివారులోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. మొదటగా భారత్ రాష్ట్ర సమితి (భారత్ భవన్)లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, ఎమ్మెల్యేలతో కలసి పార్టీ జిల్లా కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజును కుర్చీలో కూర్చొబెట్టిన అనంతరం సీఎం ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బాలరాజుకు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

కనిపించని ఎంపీ ఫొటో..



సాక్షి, నాగర్‌కర్నూల్: సీఎం పర్యటన నేపథ్యంలో నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలు, బ్యానర్లతో గులాబీమయంగా మారింది. అయితే పత్రికలు, ఫ్లెక్సీల్లో ఎక్కడా ఎంపీ రాములు ఫొటో కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ఎంపీ ఫొటో సైతం ఉండాల్సి ఉండగా చాలా వాటిలో కనిపించలేదు.

మీడియాపై ఆంక్షలు..

నాగర్‌కర్నూల్: జిల్లాలోని కలెక్టరేట్, ఎస్పీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవానికి మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాకేంద్రానికి రావడంతో కవరేజికి వెళ్లిన మీడియా ప్రతినిధులకు అధికారులు విధించిన ఆంక్షలు ఇబ్బందులు కలిగించాయి. ఎలాంటి సౌకర్యాలు లేని గదిని కేటాయించడం, కలెక్టర్ చాంబర్‌లోకి అనుమతించకపోవడంతో గంటల తరబడి ఒకే గదిలో ఉండాల్సి వచ్చింది. కనీసం టాయిలెట్స్ కూడా లేకపోవడం, బయటకు వెళ్దామంటే పోలీసులు అనుమతించకపోవడంతో అవస్థలు పడ్డారు. ఒక దశలో కొందరు కార్యక్రమం నుంచి బయటికి వెళ్లిపోయారు.

పురుగుమందు తాగి వ్యక్తి మృతి


నాగరాజు (ఫైల్)

ధరూరు: చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక.. అప్పు ఇచ్చిన వారినుంచి ఒత్తిళ్లు అధికమవడంతో ఓ యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఉప్పేరు గ్రామానికి చెందిన బోయ నాగరాజు(40) వ్యవసాయ కూలీగా పనిచేసే వారు. ఇటీవల పేకాట, మద్యానికి బానిసైన నాగరాజు గ్రామంలో చాలామందితో అధిక వడ్డీకి అప్పు చేశాడు. తిరిగి చెల్లించలేక సోమవారం రాత్రి 9గంటల సమయంలో ఇంట్లో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి 10.30 గంటల సమయంలో మృతి చెందినట్లు తెలిపారు. శవానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య బోయ జయంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ హుస్సేన్ తెలిపారు.

ఉరేసుకుని వృద్ధుడు మృతి

కోడేరు: మండలంలోని ఓ వృద్ధుడు ఉరేసుకొని మృతి చెందాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం నాగులపల్లితండాలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. తండాకు చెందిన దేవులా(60) అనే వృద్ధుడు కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇంట్లో ఉరేసుకొని మృతిచెందాడు. మృతునికి భార్య మొగలి, కూతురు, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న సింగిల్ విండో డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో రఘు, నాయకులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: బాదేపల్లి శివారులోని ఎర్రగుట్ట వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లను మంగళవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరిశీలించారు. గురువారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ప్రారంభోత్సవం చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే అసంపూర్తిగా ఉన్న రోడ్లు, విద్యుత్, తాగునీరు తదితర మౌళిక సౌకర్యాలను పూర్తి చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, కమిషనర్ మహ్మద్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలని సీఎంకు లేఖలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఎం కేసీఆర్‌కు పోస్టు కార్డుల ద్వారా లేఖలు పంపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏళ్లత తరబడిగా విధులు నిర్వహిస్తున్నా ఉద్యోగ భద్రత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కొంత కాలంగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. తమ ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పుటా అధ్యక్షుడు భూమయ్య, రవికుమార్, అర్జున్‌కుమార్, విజయ్‌భాస్కర్, శ్రీలత, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో హైదరాబద్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రెసిడెన్షియల్ పద్ధతిలో ఇచ్చే శిక్షణకు రాష్ట్రవ్యాప్తంగా 100 మంది అభ్యర్థులను అర్హత పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తామని, ఇందులో 75 శాతం ఎస్సీలకు మిగతా సీట్లు ఎస్టీ, బీసీలు ఇతరులకు కేటాయిస్తారని పేర్కొన్నారు. శిక్షణలో పుస్తకాలు, హాస్టల్, తదితర సదుపాయాలు కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వచ్చే నెల 2వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఇద్దరికి రిమాండ్

బాలానగర్: పెట్రోల్ బంక్‌లో ఆర్థిక మోసాలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ జయప్రసాద్ కథనం ప్రకారం.. బాలానగర్‌లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో 2020 నుంచి 2022 సంవత్సరం వరకు శ్రీధర్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్ గుమాస్తాలుగా పనిచేస్తూ సుమారు రూ.70 లక్షల ఆర్థిక మోసాలకు పాల్పడ్డారు. ఈ విషయపై పెట్రోల్ యజమాని తేజ ఫిర్యాదు మేరకు ఐదు నెలల క్రితం కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరపగా నేరం రుజువైంది. దీంతో ఏ1 శ్రీధర్‌గౌడ్, ఏ2 శ్రీకాంత్‌గౌడ్‌లను మంగళవారరం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వైరస్ నివారణకు ముందస్తు చర్యలు

- మిరపసాగులో యాజమాన్య పద్ధతులు
- ఏడీఏ సక్రియానాయక్ సూచనలు, సలహాలు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: రాబోయే వానాకాలం మిరప పంట సాగులో సూటి రకాలతోపాటు సంకర జాతి రకాలు అందుబాటులోకి వచ్చాయని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియానాయక్ రైతులకు సూచిస్తున్నారు. ఈ రకాల పంటలను సాగు చేసినప్పుడు వివిధ రకాల వైరస్‌లు, చీడపీడలు ఆశించే అవకాశం ఉన్నట్లు అందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం మిరప పంటకు ఆశించిన జెమిని వైరస్ పంట ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపాయని గుర్తుచేశారు. ఈ వైరస్ తెల్ల దోమ వలన వ్యాప్తి చెందినట్లు గుర్తించామన్నారు. ఈ వైరస్ సోకిన మొక్కల ఆకులు చుట్టుకుపోయి ముడతలుగా ఏర్పడతాయి. దీని వలన కిరణ జన్య సంయోగ ప్రక్రియ పూర్తిగా దెబ్బతిని దిగుబడి తగ్గుతుంది. కాయ పరిమాణం, నాణ్యతపై ప్రభావం చూపుతుంది. ఈ వైరస్‌ను ఆదిలోనే అరికట్టడానికి విత్తన శుద్ధి మంచి ఆయుధంగా పని చేస్తోందని ఆయన వివరించారు.

టీఎస్‌టపీతో..

ట్రై సోడియం ఆర్థోపాస్పేట్ (టీఎస్‌టపీ) అనే మందు పొడి ద్వారా వైరస్ తెగులును సమర్థవంతంగా అరికట్టవచ్చు.


విత్తన శుద్ధి ఇలా..


150 గ్రాముల ట్రై సోడియం ఆర్థోపాస్పేట్ (టీఎస్‌టపీ) అనే పొడిని ఒక లీటర్ మందును కలుపుకోవాలి. ఈ ద్రావణంలో 1 కిలో మిరప విత్తనాలను 10 నిమిషాలు నానబెట్టాలి. ఇలా నానబెట్టిన విత్తనాలను 10 నిమిషాల తర్వాత బయటికి తీసి చల్లని నీటిలో రెండుసార్లు కడగాలి. ఈ విధంగా చల్లటి నీటితో కడిగిన విత్తనాలను గోనె సంచిపై లేదా పలుచటి గుడ్డపై నీడలో ఆరబెట్టి తేమపోయిన తర్వాత ఈ విత్తనాలను విత్తుకోవాలి. ఈ విధంగా చేయడం వలన మిరపకు వచ్చే వైరస్‌ను దాదాపుగా అరికట్టవచ్చని వివరిస్తున్నారు.


వైరస్ సోకిన మిరప మొక్క (ఫైల్)

కలుపు మొక్కలు..

మిరప పొలం చుట్టూ ఉన్న గట్లపై పెరిగిన కలుపు మొక్కలను ఏరి తీసి వేయాలి. ముఖ్యంగా తిక్క అలుము, గడ్డి, ఉమ్మెత్త వంటి కలుపు మొక్కలను పూర్తిగా నిర్మూలించాలి. ఈ కలుపు మొక్కలు వైరస్‌కు ఆతిథ్య మొక్కలుగా ఉంటాయి. తెల్ల దోమ ఈ కలుపు మొక్కల పూల నుంచి మిరపకు ఈ వైరస్‌ను మోసుకోస్తాయి. ఇది గమనించి కలుపు మొక్కల నివారణ చాలా ముఖ్యమైనది.


వైరస్ సోకి ముడతలు పడిన మిరప ఆకులు (ఫైల్)


కిరణ జన్య సంయోగ లేక దెబ్బ తిన్న మిరప మొక్క (ఫైల్)

పసుపు పచ్చ అట్టలు..

మిరప పంట సాగు చేసిన వెంటనే పొలంలో పసుపు పచ్చ అట్టలు పెట్టుకోవాలి. ఈ అట్టలకు నూనె లేదా గ్రీస్‌ను పూయాలి. ఎకరానికి 20 నుంచి 25 అట్టలను అక్కడక్కడ అమర్చాలి. వైరస్ తెగుళ్లను కలుగజేసే తెల్ల దోమలు ఈ పసుపు పచ్చ అట్టలకు అంటుకొని వాటి సంఖ్య కొంత వరకు తగ్గుతుంది.

తెలంగాణ వర్సిటీలో విజి'లెన్స్'

- అధికారుల విస్తృత తనిఖీలు
- తెలంగాణ వర్సిటీ వీసీ పీఏ నుంచి ఫైళ్లు స్వాధీనం
- సోదాలు జరుగుతుండగా ఫైళ్లతో కారులో వెళ్లిన వీసీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ /భిక్కనూరు (కామారెడ్డి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో వైస్ చాన్స్‌లర్ రవీందర్ గుప్తా, ప్రొఫెసర్ కనకయ్య హయాంలో జరిగిన అక్రమ నియామకాలు, నిధుల దుర్వినియోగం, విచ్చలవిడి కొనుగోళ్లు తదితరాల నేపథ్యంలో మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తనిఖీలు చేపట్టింది. రామచంద్రాపురం యూనిట్ (ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల పర్యవేక్షణ)కు చెందిన అదనపు ఎస్పీ ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 10 మంది సభ్యులు బృందాలుగా విడిపోయి వర్సిటీలోని ఎస్టేట్ విభాగం, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం, అకౌంట్స్, ఇంజనీరింగ్, ఎగ్జామినేషన్ బ్రాంచ్, రిజిస్ట్రార్ ఆఫీస్, పర్చేజ్ కమిటీ, సర్వర్ రూమ్‌లలో విస్తృత సోదాలు చేశారు. వీటికి సంబంధించిన రికార్డులు, సీపీయూలు స్వాధీనం చేసుకున్నారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఈ సోదాలు చేశారు. బుధవారం సైతం ఈ సోదాలు ఉండనున్నట్లు తెలుస్తోంది.

వీసీ వెంటపడి వెళ్లిన విజిలెన్స్ అధికారులు

ఇదిలా ఉండగా అధికారులు తనిఖీలు ప్రారంభించిన 30 నిమిషాల తరువాత వర్సిటీలో తన చాంబర్‌లో ఉన్న వీసీ రవీందర్‌గుప్తా తన పీఏ ద్వారా కొన్ని ఫైల్స్ తెప్పించుకుని కారులో పెట్టుకుని హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. దీంతో ఒక బృందం వీసీ కారును వెంబడించి కామారెడ్డి జిల్లా భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నారు. వాహనంలో ఉన్న వీసీ వద్దకు విజిలెన్స్ అధికారులు వెళ్లగా తన వాహనాన్ని ఎందుకు నిలిపారని, తనను ప్రశ్నించే అధికారం మీకు ఉందా అని ప్రశ్నించినట్టు తెలుస్తోంది. దీంతో విజిలెన్స్ అధికారులు వీసీ పీఏ సవితతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.


ఫైళ్లు తీసుకెళ్తున్న అధికారులు

టోల్‌ప్లాజా వద్ద విచారణ 'సీన్'

టోల్‌ప్లాజా కార్యాలయం గదిలో గంటకు పైగా ఆమె వద్ద ఉన్న ఫైళ్లను పరిశీలించారు. కొన్ని ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సవిత వద్ద ఫైళ్లను పరిశీలించినంత సేపూ వీసీ రవీందర్ గుప్తా తన వాహనంలోనే కూర్చున్నారు. అనంతరం హైదరాబాద్ వెళ్లిపోయారు.

బ్యాంకు స్టేట్‌మెంట్లను పరిశీలిస్తాం

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ రికార్డులు స్వాధీనం చేసుకున్నామని, బ్యాంకు స్టేట్‌మెంట్ల కూడా పరిశీలిస్తామని చెప్పారు

రెండో విడత పంట నష్టపరిహారానికి
రూ. 230 కోట్లు

- 2.30 లక్షల ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం
- ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ తుది నివేదిక
- త్వరలో రైతుల ఖాతాలో జమ చేసేందుకు ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: గత ఏప్రిల్ నెలలో రెండో విడత వడగళ్లు, భారీ వర్షాలకు జరిగిన పంట నష్టానికి రైతులకు రూ. 230 కోట్లు పరిహారంగా ఇవ్వాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. వివిధ జిల్లాల్లో 2.30 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని నిర్ధారించి, ప్రభుత్వానికి వ్యవసాయశాఖ తుది నివేదిక ఇచ్చింది. నిధులను త్వరలో విడుదల చేసి రైతులకు అందజేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు వ్యవసాయ వర్గాలు వెల్లడించాయి.

మొదటి విడతలో రూ. 151 కోట్లు..

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో రెండుసార్లు వడగళ్లు, భారీ వర్షాలకు లక్షలాది ఎకరాల్లోని యాసంగి సీజన్ పంటకు నష్టం జరిగిన సంగతి తెలిసిందే. వరి, మొక్కజొన్న, మామిడి తదితర పంటలకు తీవ్రమైన నష్టం వాటిల్లింది. మార్చి నెలలో కురిసిన వడగళ్లు, వర్షాలకు 1.51 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రభుత్వం నిర్ధారించింది. నష్టం జరిగిన ప్రాంతాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయానా పర్యటించి, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ప్రకటించిన విషయం విదితమే. ఆ మేరకు ప్రభుత్వం రూ. 151 కోట్లు పరిహారం మంజూరు చేసింది. ఆ పరిహారం రైతుల ఖాతాల్లో ఇంకా పూర్తిస్థాయిలో పడలేదని, ప్రక్రియ కొనసాగుతుందని వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడించాయి.

ఒక విపత్తు నష్టానికే..: ఈ ఏడాది విపత్తు కారణంగా రెండుసార్లు పంటలకు నష్టం వాటిల్లింది. రెండు విడతల్లో పంట నష్టం జరిగిన రైతులకు ఒక్క దానికి మాత్రమే పరిహారం ఇవ్వాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. నష్టపోయిన ప్రతి రైతు ఒకే వ్యవసాయ సీజన్‌లో ఒక విపత్తుకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీకి అర్హులని స్పష్టం చేసింది. అంటే మొదటి విడత ఒక రైతుకు ఒక ఎకరాలో పంట నష్టం జరిగి పరిహారం ప్రకటిస్తే, అదే రైతుకు ఏప్రిల్‌లోని విపత్తుకు మరో ఎకరాలో నష్టం జరిగితే దాన్ని పరిగణలోకి తీసుకోరు. ఒక రైతుకు వేర్వేరు చోట్ల ఉన్న వ్యవసాయ పంటలకు పూర్తి నష్టం జరిగితే ఒకదాన్నే ఎలా గుర్తిస్తారన్న విమర్శలున్నాయి. దీనిపై నిర్ణయం తీసుకోవడంలో వ్యవసాయశాఖ విఫలమైందన్న చర్చా జరుగుతోంది. కాగా, ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని వ్యవసాయశాఖ పేర్కొంది. వీటిని వీలైనంత వరకు ఆధార్‌తో అనుసంధానం చేయాలని ఆదేశించింది.

పూర్తి కాని కొనుగోళ్లు.. | ఆందోళనలో రైతన్నలు

- ఏడువేల కొనుగోలు కేంద్రాల్లో మూడువేలు మూసివేత
- ఇంకా చాలా జిల్లాల్లో చివరి దశలో కొనుగోళ్లు
- 57 లక్షల ఎంటీల ధాన్యం సేకరణ.. మరో 4.55 లక్షల ఎంటీల సేకరణ లక్ష్యం
- సమీపిస్తున్న రుతుపవనాలు, మొదలైన ఏరువాక



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రభుత్వం తలపెట్టిన ధాన్యం కొనుగోళ్లు ఇంకా పూర్తి కాకపోవడం రైతులను కలవరపెడుతోంది. చాలా జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఇంకా అమ్ముడుకాకపోవ డంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. ఓవైపు రుతుపవనాలు సమీపిస్తుండటం, రబీ సీజన్ మొదలవుతుండటం.. ఇంకోవైపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఇంకా అమ్ముడుపోకపోవడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు.. మిల్లర్లు కుమ్మక్కై చాలాచోట్ల క్వింటాలుకు 9 నుంచి 11 కిలోల వరకు కోత పెడుతున్నారు. అయినా సరే రైతులు కోతలకు సమ్మతించినా.. మిల్లర్లు చాలా చోట్ల కొర్రీలు పెడుతుండటం, ధాన్యాన్ని మిల్లుల్లో దింపకుండా అలాగే ఉంచడంతో లారీలు కొనుగోలు కేంద్రాలకు సరిగా వెళ్లడం లేదు. దీంతో కొనుగోళ్లలో తీవ్ర జాప్యం నెలకొంటోంది.

మరో 4.55 లక్షల మెట్రిక్ టన్నుల దూరంలో..

ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 62.16 లక్షల మెట్రిక్ టన్నుల (ఎంటీలు) ధాన్యం సేకరించాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 7,192 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. జూన్ 6 నాటికి అందులో 3,181 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తయింది. కానీ, మధ్యలో మిల్లర్ల కొర్రీలు, అకాల వర్షాలు, లారీల కొరత తదితర కారణాల వల్ల ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకు 57.61 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, మరో 4.55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన ధాన్యం విలువ రూ.11,843 కోట్లుగా ఉంది.

ప్రభుత్వ లక్ష్యం నెరవేరేనా?

ఏరువాక ఉత్సవాలతో రబీ సీజన్ మొదలైంది. ఈసారి రబీని నవంబరు నాటికి పూర్తి చేసి, యాసంగి పంట కోతలను మార్చి నాటికి ముగించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈసారి వేసవిలో అకాల వర్షాలు రైతులకు గత వందేళ్లలో ఏనాడూ చూడని నష్టాన్ని కలగజేశాయి. దీనికి తోడు వేసవిలో కోతలు ఏప్రిల్ వరకు సాగితే, వరి నుంచి మర ఆడిస్తే నూక అధికంగా వస్తుంది. ఈ సమస్యలను అధిగమించి మార్చి నాటికి కోతలను ముగిస్తే.. రైతుకు ప్రకృతి విపత్తులు, నూకల బెడద తప్పుతుందన్నది ప్రభుత్వ వ్యూహం. కానీ, కొనుగోళ్ల ప్రక్రియ జాప్యమవడంతో రబీ, యాసంగి సీజన్‌ల పంట ఆలస్యమయ్యే ప్రమాదముందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మూడు రోజుల్లో పూర్తి



మరో మూడు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తాం. ఎక్కడా రైతులకు ఇబ్బంది రానీయం. 95% ధాన్యం కొనుగోలు చేశాం. త్వరలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు కూడా జమవుతాయి.

–మంత్రి గంగుల కమలాకర్

కొనుగోళ్ల వేగం పెంచాం



రాష్ట్రంలో కొనుగోళ్ల ప్రక్రియ వేగం పుంజుకుంది. మంగళవారం ఒక్కరోజే 1,31,703 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడమే ఇందుకు నిదర్శనం. అకాల వర్షాలు, సాంకేతిక సమస్యల కారణంగా కొంచెం జాప్యమైన మాట వాస్తవమే. రెండు మూడు రోజుల్లో మిగిలిన 4.55 లక్షల మెట్రిక్ టన్నులు సైతం కొనేస్తాం.

–సర్దార్ రవీందర్ సింగ్, పౌరసరఫరాల శాఖ, చైర్మన్

కాంటా వేసి పదిహేను రోజులు



కొనుగోలు కేంద్రంలో 400 బస్తాలు కాంటా వేసి, 15 రోజులైతంది. లారీలు రాకపోవడంతో, బస్తాలు కొనుగోలు కేంద్రంలోనే ఉన్నాయి. వానలు పడుతుండటంతో తడుస్తయేమో అని భయంగా ఉంది. బస్తాలు తడవకుండా కవర్లు కప్పి ఉంచిన. ఇక్కడే కాపలా ఉంటున్న. లారీలు పంపి బస్తాలను మిల్లులకు తీసుకుపోవాలి. – కొట్టె అంజన్న, తాళ్లపేట, దండేపల్లి, మంచిర్యాల

నెలరోజులు గడుస్తున్నా..



గాధిర్యాల్ కేంద్రంలో ధాన్యం సేకరణ ఆలస్యంగా జరుగుతోంది. ధాన్యాన్ని కేంద్రానికి తెచ్చి నెల రోజులు దాటినా తూకం వేయలేదు. దీంతో నిత్యం వానలతో అవస్థలు పడుతున్నాం. రోజుకింత తడిసినప్పుడల్లా ధాన్యం మొలకెత్తుతోంది. 400 బస్తాల వరకు ధాన్యం ఉంది. ఇప్పటికైనా త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలి. –కుర్వ భీరతయ్య, రైతు గాధిర్యాల్, మహబూబ్‌నగర్

అడ్వాన్స్‌డ్‌లో 'వాట్సాప్ కాపీయింగ్'

▶ మొదటి పేజీ తరువాయి

ఎల్బీనగర్‌లోని కళాశాలల్లో సెంటర్లు పడ్డాయి. అయితే తన సోదరుడితో పాటు స్నేహితులకు కూడా మంచి మార్కులు రప్పించాలని భావించిన కడప విద్యార్థి ఐదుగురితో ఓ వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశాడు. కళాశాలల్లో తనిఖీ చేసే సిబ్బంది కళ్లుగప్పిన ఈ ఐదుగురూ పరీక్ష కేంద్రాల్లోకి తమ స్మార్ట్‌ఫోన్లు తీసుకువెళ్లారు.

కంప్యూటర్ స్క్రీన్ ఫొటోలు తీసి..

ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన ఈ పరీక్షను అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రాయాల్సి ఉంటుంది. కంప్యూటర్‌లో ఒక ప్రశ్న తర్వాత మరో ప్రశ్న ప్రత్యక్షమవుతూ ఉంటే.. విద్యార్థులు జవాబులు టిక్ చేస్తూ పోతుంటారు. కడప విద్యార్థి కంప్యూటర్ స్క్రీన్‌పై తాను టిక్ చేసిన ప్రతి జవాబును ప్రశ్నతో సహా కనిపించేలా స్మార్ట్‌ఫోన్‌లో ఫొటోలు తీసి, వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయడం ద్వారా మిగిలిన నలుగురికీ చేరేలా చేశాడు. ఎస్వీఐటీ కాలేజీలో పరీక్ష హాలు పెద్దదిగా ఉండటం, ఇన్విజిలేటర్ విధుల్లో ఉన్న సిబ్బంది ఒకేచోట కూర్చుండిపోవడంతో గంటన్నర పాటు ఈ తతంగాన్ని ఎవరూ గుర్తించలేదు. 10.30 గంటల సమయంలో మల్లాపూర్ కేంద్రంలో ఇన్విజిలేటర్ అక్కడి విద్యార్థి వద్ద స్మార్ట్‌ఫోన్ ఉండటాన్ని గమనించారు. అందులో ఉన్న వాట్సాప్ గ్రూపులో కంప్యూటర్ స్క్రీన్ ఫొటోలను చూసిన ఆయన సదరు విద్యార్థిని ప్రశ్నించగా విషయం వెలుగులోకి వచ్చింది. ఎస్వీఐటీ కాలేజీ పరీక్ష కేంద్రంలోని కడప విద్యార్థి నుంచి ఈ ఫొటోలు వస్తున్నట్లు తెలుసుకుని ఆ సెంటర్ అధికారికి సమాచారమిచ్చారు. ఆయన కేంద్రంలోకి వెళ్లి కడప విద్యార్థిని తనిఖీ చేయగా అతడి వద్ద స్మార్ట్‌ఫోన్ లభించింది. ఇదే క్రమంలో మౌలాలి, ఎల్బీనగర్‌లోని కేంద్రాల్లో పరీక్ష రాస్తున్న మరో ముగ్గురినీ పట్టుకున్నారు. ఈ ఐదుగురూ ఐఐటీ–హైదరాబాద్ తరఫున జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు నిర్వహిస్తున్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఐఓఎన్ సంస్థకు క్షమాపణ పత్రాలు రాసి ఇచ్చారు. సంస్థ సిబ్బంది ఆదివారం రాత్రి మార్కెట్, మల్కాజ్‌గిరి, ఎల్బీనగర్, నాచారం పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేయగా మంగళవారం వెలుగులోకి వచ్చింది.

నిర్వహణ సంస్థ నిర్లక్ష్యం?

విద్యార్థులపై పోలీసులు ఐపీసీ 188, 420తో పాటు తెలంగాణ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్‌లోని 4 (బీ), 8 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఐదుగురి ఫోన్లనూ స్వాధీనం చేసుకున్నారు. ఈ పరీక్ష నిర్వహిస్తున్న ప్రైవేట్ సంస్థ నిర్లక్ష్యంతోనే స్మార్ట్ ఫోన్లు పరీక్ష కేంద్రంలోకి వెళ్లాయని చెప్తున్నారు. నాలుగు పరీక్ష కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న ఇన్విజిలేటర్లు, అబ్జర్వర్లకూ నోటీసులు ఇచ్చి విచారించడంతో పాటు వాంగ్మూలం నమోదు చేయాలని భావిస్తున్నారు.

బీఆర్ఎస్.. విద్యుత్ ఉత్పత్తి పెంచలేదు

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని బీజేపీ నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి విమర్శించారు. సీఎం కేసీఆర్ ఇస్తున్నది ఉచిత విద్యుత్ కాదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఏడాదికి ఒక హార్స్‌పవర్‌కి రూ.20 చార్జ్ (ఏడు గంటల కరెంట్ సరఫరాకు) చేశారని, కేసీఆర్ మాత్రం సర్‌చార్జ్ పేరుతో ఒక హెచ్పీకి రూ.20 వసూలుతో పాటు, ఇంటికి వాడే కరెంటుకూ సర్‌చార్జీలను వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు 24గంటల కరెంట్ ఇవ్వడం లేదన్నారు. ఉచిత విద్యుత్‌కు డబ్బు ఎవరు ఇస్తున్నారు? ఎక్కడ నుంచి వస్తుందో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టుల నుంచి వస్తున్న విద్యుతే ఇప్పుడు సరఫరా చేస్తున్నారన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు ఒప్పందం మేరకు డబ్బు ఇవ్వకపోవడంతో ఆ రాష్ట్రం తెలంగాణపై కేసు వేసిందని చెప్పారు.

మంటగలుస్తున్న మానవత్వం


వనపట్ల శివారులో జరిగిన హత్య సంఘటనను పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

క్షణికావేశంలో నేరాలు

- హత్యలతో చిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు
- నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మారని వైనం

నాగర్‌కర్నూల్ క్రైం: క్షణికావేశంలో చేస్తున్న హత్యలతో నిండునూరేళ్ల జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోతున్నాయి. కుటుంబాల్లో తీరని విషాదంతోపాటు చిన్నారులు, తల్లిదండ్రులు అనాథలుగా మారే పరిస్థితి నెలకొంది. జీవితాంతం తోడు నీడగా ఉండాల్సిన భర్త భార్యపై అనుమానంతో కొందరు , ఆస్తి కోసం క్షణికావేశంలో మరికొందరు, మానసికస్థితి సరిగా లేకపోవడంతో ఇంకొందరు అతికిరాతకంగా హత్యలకు పాల్పడుతున్నారు. తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారు. కొద్ది నెలలుగా జిల్లాలో ఎక్కడో ఒకచోట హత్యలు చోటుచేసుకుంటుండంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో జిల్లా పరిధిలో చోటుచేసుకుంటున్న హత్యలు క్షణికావేశంలో చోటుచేసుకున్నవే ఎక్కువగా ఉన్నాయి.

అవగాహన కల్పిస్తున్న మారని వైనం..

జిల్లా పరిధిలో జరుగుతున్న హత్యలతో ప్రజల్లో నెలకొన్న భయాన్ని తగ్గించడం కోసం నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల పరిధిలో పోలీసుశాఖ ద్వారా నేరాలకు పాల్పడితే జరిగే పరిణామాలపై , విధించే శిక్షల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ పరిస్థితి మారడంలేదు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో తీవ్ర ఇబ్బందులు ఎదురవడమే కాకుండా హత్యలకు పాల్పడి తల్లిదండ్రులు తమ పిల్లలకు దూరమవుతారన్న విషయం మర్చిపోతున్నారు. క్షణికావేశంలో జరిగే హత్యల వల్ల పిల్లలు అనాథలుగా మారి, సమాజంలో చిన్నచూపునకు లోనవుతారనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది.

ఈ ఏడాది జిల్లాలో జరిగిన హత్యలు..

- జనవరి 9న తాడూరు మండలంలోని ఇంద్రకల్ గ్రామంలో తాగుబోతు కొడుకును తండ్రి హతమార్చారు.
- జనవరి 16న బిజినేపల్లి మండలం వట్టెం గ్రామంలో తాగి వేధిస్తున్నాడనే కోపంతో ఓ మహిళ మాజీ ప్రియుడిని తలపై రాయితో మోది హత మార్చింది.
- జనవరి 25న చారకొండలో మతిస్థిమితం కోల్పోయిన కొడుకు, తండ్రితో గొడవపడి రోకలిబండతో తలపై మోది హత్యకు పాల్పడ్డాడు.
- ఏప్రిల్ 10న తిమ్మాజిపేట మండలం ఆవంచలో ఆస్తి తగాదాలతో తమ్ముడిని అన్న హత్య చేసిన సంఘటన చోటుచేసుకుంది.
- మే 6న జిల్లాకేంద్రంలోని నెల్లికొండ గేటు సమీపంలో అక్రమసంబంధం నేపథ్యంలో మహిళను హతమార్చిన సంఘటన చోటుచేసుకుంది.

చర్యలు తీసుకుంటాం..



జిల్లా పరిధిలో జరిగిన హత్యలు క్షణికావేశంతో, అవగాహన లోపంతో జరుగుతున్నవే. నేరాలు చేస్తే జరిగే పరిణామాలపై, శిక్షలపై పోలీస్‌శాఖ తరఫున ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. చట్టం పరిధిని దాటి ఎవరైనా నేరాలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తాం. – మనోహర్, ఎస్పీ, నాగర్‌కర్నూల్

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ ఎంపికలు


షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులతో రవికుమార్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రం పాలమూరు యూనివర్సిటీ సమీపంలోని మిసా ఇండోర్ స్టేడియంలో మంగళవారం ఉమ్మడి జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ నిర్వహించారు. సింగిల్స్, డబుల్స్‌లో పోటీలు నిర్వహించి త్వరలో జరిగే రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎల్. రవికుమార్ మాట్లాడుతూ వ్యక్తిగత క్రీడాంశాల్లో షటిల్ బ్యాడ్మింటన్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో షటిల్ బ్యాట్మింటన్ అభివృద్ధికి తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గెలుపొందిన వారికి ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి సాదత్‌ఖాన్, జిల్లా వాలీబాల్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి చెన్న వీరయ్య, జిల్లా యోగా సంఘం కార్యదర్శి బాల్‌రాజు, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రమేశ్ బాబు, షౌకత్ హష్మి, మహ్మద్ అహ్మద్, డాక్టర్ ఇమ్రాన్, రాం మోహన్, సీనియర్ క్రీడాకారులు సయ్యద్ ఎజాస్ అలీ, హామెద్, వెంకటప్ప పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు..

బాలుర విభాగం సింగిల్స్‌లో అండర్–13లో శివశంకర్, శ్రీవిహాన్, డబుల్స్‌లో సాద్ హుస్సేన్ హష్మి–జైనుల్ అబెదిన్, అండర్–15 సింగిల్స్‌లో సంతోష్, ఎస్‌జె.జోయల్, డబుల్స్‌లో జోయల్–సంతోష్, అండర్–17టి.సుమిత్‌కుమార్, అండర్–19 సింగిల్స్‌లో సంగిశెట్టి శ్రీరాగ్, శివకృష్ణ, డబుల్స్‌లో అబ్దుల్ రహమాన్–ఎండీ అమాన్, సీనియర్ పురుషుల విభాగం సింగిల్స్‌లో సంగిశెట్టి శ్రీరాగ్, సయ్యద్ అద్నాన్‌అలీ, డబుల్స్‌లో అబ్దుల్ రహెమాన్–జీషాన్, మాస్టర్స్ విభాగం సింగిల్స్‌లో సయ్యద్ ఎజాజ్‌అలీ, వెంకటప్ప, డబుల్స్‌లో ఎండీ మహెబూబ్ అలీ–వెంకటప్ప, బాలికల విభాగం అండర్–13లో దీక్ష సహస్ర, ఆనెం గ్లోరి సుజాన్, డబుల్స్‌లో వైష్ణవి–దీక్ష సహస్ర, సింగిల్స్‌లో అండర్–15, అండర్–17 విభాగాల్లో ద్రితి సహస్ర ఎంపికయ్యారు.

పులి సంచారంతో రైతుల ఆందోళన


వటువర్లపల్లి గ్రామ పొలాల్లో సంచరిస్తున్న పెద్దపులి

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం సమీప గ్రామ వ్యవసాయ పొలాల్లో పెద్దపులి సంచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని వటువర్లపల్లిలో ఈ మధ్య కురిసిన కొద్దిపాటి వర్షాలకు రైతులు పొలాలు సాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో అటవీ సమీపంలోని వ్యవసాయ పొలంలో ఎద్దులతో భూమి దున్నుతుండగా పెద్దపులి వచ్చింది. భయాందోళనకు గురైన రైతులు ఓంకారం, శ్రీశైలం, సోమనాథ్ అరుపులు కేకలు వేయడంతో అడవిలోకి వెళ్లిందని అన్నారు. పెద్దపులి సంచారం గురించి గ్రామ రైతులు అటవీ శాఖ అధికారులకు తెలిపారు. దీంతో అటవీశాఖ అధికారులు తమ సిబ్బందితో వచ్చి పెద్దపులి సంచరించిన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. రైతులు, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితమే వటువర్లపల్లికి చెందిన కొర్ర దేవులానాయక్‌కు చెందిన పశువుల మందపైపడి పాడి ఆవును చంపివేసింది. రెండు రోజుల్లోనే రెండుసార్లు పెద్దపులి గ్రామం సమీపంలో కనిపించడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.


జీతాలు చెల్లించాలని.. పెట్రోల్ డబ్బాలతో నిరసన


పెట్రోల్ డబ్బాలతో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

గద్వాల అర్బన్: కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులకు, కార్మికులకు 13 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని మంగళవారం 70 మంది ఉద్యోగులు, కార్మికులు మంగళవారం జిల్లాకేంద్రంలోని కార్మికశాఖ కార్యాలయం ఎదుట పెట్రోల్ డబ్బాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, కార్మికులు, గ్రామ సర్పంచ్ ఆత్మలింగారెడ్డి మాట్లాడుతూ మానవపాడు మండలంలోని కలుకుంట్ల నది బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పదేళ్లుగా 145 మంది ఉద్యోగులు, 60 మంది రోజువారీ కూలీలు పనిచేస్తున్నారన్నారు. అయితే కంపెనీ మేనేజ్‌మెంట్ గత రెండేళ్లుగా సక్రమంగా జీతాలు చెల్లించడం, ఈ విషయంపై ఏప్రిల్ మొదటి వారంలో కంపెనీ ఎదుట ధర్నా చేయగా.. మే 15లోగా రెండు నెలల జీతాలు చెల్లించి, మిగితాది జూన్ వరకు మొత్తం చెల్లిస్తామని ఒప్పుకున్నారన్నారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి జీతాలు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారన్నారు. వెంటనే 13 నెలల జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మిక శాఖ అధికారి మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగుల వరకు నీరు చేరింది. జూరాల ఎడమ కాలువ, సమాంతర కాలువకు నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాలువ నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏ.ఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి, తెలిపారు.


రామన్‌పాడులో నీటిమట్టం

బండరాయితో మోది.. భార్యను హతమార్చిన భర్త

లింగాల: కుటుంబ కలహాలతో భార్యను భర్త బండరాయితో మోది హతమార్చాడు. ఈ సంఘటన మండలంలోని రాయవరం గ్రామ శివారులో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ధారారం గ్రామానికి చెందిన ఏదుల పర్వతాలుగౌడ్‌కు పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ(35)తో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ సంతానం ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో 14 ఏళ్ల నుంచి విడిపోయి దూరంగా ఉంటున్నారు. ఇదే సమయంలో పర్వతాలుగౌడ్ అచ్చంపేట మండలం లింగోటం గ్రామానికి చెందిన కృష్ణవేణిని రెండో వివాహం చేసుకున్నాడు. కులవృత్తి అయిన కల్లు అమ్మకాలను చేసుకొని జీవనం కొనసాగించాలని, నేను హైదరాబాద్ వెళ్లి మరో పని చేసుకుంటానని చెప్పి 8 నెలల క్రితం వెళ్లిన పర్వతాలు మొదటి భార్య లక్ష్మమ్మను తీసుకువెళ్లి వికారాబాద్ జిల్లా తాండూరులో ఉంటున్నారు. ఈ క్రమంలో ధారారంలో బొడ్రాయి పండుగ ఉండగా పర్వతాలు మొదటి భార్యతో కలిసి సోమవారం సాయంత్రం లింగాలకు చేరుకున్నాడు. ఈ విషయం రెండో భార్యకు తెలియడంతో ఇంటికి రావడానికి నిరాకరించింది. దీంతో ధారారంలో ఉన్న తన ద్విచక్రవాహనాన్ని తెప్పించుకొని అంబట్‌పల్లి వెళ్లి అక్కడ కొద్దిసేపు తెలిసిన వారి ఇంటి వద్ద ఉన్నారు. రాత్రి 11 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై రాయవరం మీదుగా ధారారం వెళ్లారు. మార్గమధ్యలో ఇద్దరి మధ్య గొడవ జరిగినట్లు తెలిసింది. వడ్డె రాయవరం సమీపంలో ఉన్న బ్రిడ్జి దగ్గరకు చేరుకున్న సమయంలో లక్ష్మమ్మను పర్వతాలు బండరాయితో తల వెనక భాగంలో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న సీఐ అనుదీప్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై లక్ష్మమ్మ అక్క జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సీఐ పర్యవేక్షణలో దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ తెలిపారు.


లక్ష్మమ్మ మృతదేహం